క్లుప్తంగా

వృద్ధులకు ఆర్థిక సాయం



తిరువూరు: స్థానిక బస్టాండు సెంటర్లోని ఐడి యాస్ సేవాసంస్థలో పలువురు వృద్ధులకు అత్యవసర వైద్యఖర్చుల నిమిత్తం శనివారం ఆర్థిక సాయం అందజేశారు. జర్మనీకి చెందిన మిసేరోర సంస్థ సహకారంతో తిరువూరులోని అశోక్‌నగర్, సీతమహాలక్ష్మి కాలనీ, రాజుపేట ఎస్సీ కాలనీలకుచెందిన 30 మందికి ఈ ఆర్థిక సాయాన్ని అందించినట్లు ఐడియాస్ సేవా సంస్థ డైరెక్టర్ అవ్వారి శౌరి తెలిపారు. వృద్ధులకు, సీనియర్ సిటిజన్లకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆయుష్మాన్ బీమా, సీనియర్ సిటిజన్ గుర్తింపు కార్డులను అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరువూరు గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ ఉయ్యూరు అనసూయ తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షలు ప్రారంభం



తిరువూరు: దక్షిణ భారత హిందీ ప్రచార సభ వార్షిక పరీక్షలు తిరువూరులో శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక చీరాల సెంటర్లోని సర్వోదయ ప్రాథమికోన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలకు తిరువూరు, గంపలగూడెం, ఏకొండూరు మండలాల విద్యార్థులు హాజరయ్యారు. ఇన్‌చార్జి డీవైఈవో శ్యాంసుందర్ పరీక్షల నిర్వహణను తనిఖీ చేశారు. పరీక్షా కేంద్ర ఛీఫ్ సూపరింటెండెంట్ రమణమూర్తి, హిందీ ప్రచారక్ రఘునందన్ పర్యవేక్షించారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహం అందజేత



మైలవరం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ కార్యాలయంలో మార్చి 2025 లో పదవ తరగతిలో 600కు 593 మార్కులు సాధించిన పసుపులేటి నందినిని అభినందిస్తూ సంఘం అధ్యక్షులు జడ్.నాగిరెడ్డి, సభ్యులు శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా నందినికి అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.10,000 నగదు ప్రోత్సాహం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 201 కేసులు పరిష్కారం



మైలవరం: జాతీయ లోక్ అదాలత్‌లో 201 కేసులు పరిష్కారమైనట్లు జడ్జి ఎం.శైలజ తెలిపారు. వివిధ కేసులకు సంబంధించి కక్షిదారులు మధ్య రూ.43లక్షలు ఇచ్చిపుచ్చుకొనుట ద్వారా రాజీ చేసుకున్నట్లు పేర్కొన్నారు. కక్షిదారులు తమ సమస్యలను గ్రామాల్లో పరిష్కరించుకోవడం ద్వారా వారి విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు.

వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం

విస్సన్నపేట: మండలంలో శనివారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయాయి. విస్సన్నపేటలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవటంతో ప్రధాన రహదారిపై నీరు తన్నిపట్టాయి. పుట్రేల రోడ్డులో నివాసగృహం ఆవరణలోకి వర్షం నీరు చేరింది. పలు వీధుల్లో ఇళ్ల ముందు డ్రైనేజీ తీయకపోవటంతో పారుదల సక్రమంగా లేక నీరు నిల్వ ఉండిపోయింది. దీంతో పల్లంగా ఉన్న నివాస ప్రాంతాల వద్ద మురుగునీరు చేరుతుంది. పుట్రేల రోడ్డులో వికాస్ కళాశాల ఎదురుగా వాగు ప్రవాహం ఎక్కువై విస్సన్నపేట–తిరువూరు ప్రధాన రహదారిపైగా వర్షంనీరు ప్రవహిస్తుంది.

ఆగిరిపల్లిలో భారీ వర్షం

ఆగిరిపల్లి: మండలంలో శనివారం వర్షం దంచి కొట్టింది. ఉదయం నుంచి 3 గంటల పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆగిరిపల్లిలో 40.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎగువన కురిసిన వర్షాలతో కుంపిని వాగు ఉధృతంగా ప్రవహిస్తూ ఉండడంతో ఆగిరిపల్లి, నూగుండపల్లి, తోటపల్లి, చిన్నగిరిపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



పుట్రేల రోడ్డులో ఓ ఇంటి ఆవరణలోకి చేరిన వర్షం నీరు

వాగు ఉధృతిని ఎస్సై శుభ శేఖర్ పరిశీలించి వంతెనపై పోలీస్ గస్తీ ఏర్పాటు చేశారు.

నూజివీడు: అల్పపీడనం ప్రభావంతో నూజివీడు పట్టణంతో పాటు మండలంలో శనివారం భారీ వర్షం పడింది. రెండు గంటల పాటు కురిసిన వర్షానికి పట్టణంలోని రోడ్లన్నీ వరదనీటితో నిండిపోయి వాగులను తలపించాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభమైన వర్షం 2.30 గంటల వరకు పడుతూనే ఉంది. దీంతో జంక్షన్ రోడ్డు, బస్టాండు రోడ్డు, మైలవరం రోడ్డు, అమెరికన్ ఆసుపత్రి రోడ్డు జలమయమైంది. మైలవరం రోడ్డులో కోర్టు, రూరల్ పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం పట్టణ పోలీస్‌స్టేషన్, సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంతాల్లో రోడ్లపైన వర్షపు నీరు వాగులను తలపించేలా ప్రవహించింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, కల్వర్టులు లేకపోవడంతో వర్షం కురిసినప్పుడల్లా వరద నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. జంక్షన్ రోడ్డులో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నీళ్లు చేరడంతో వాహనాలు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.



నూజివీడులోని కోర్టు భవనాల ప్రాంతంలో వాగును తలపిస్తోన్న ప్రధాన రహదారి



నూగుండపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుంపిని వాగు

విష వాయువుల విడుదలపై గ్రామస్తులు ఆగ్రహం

జి.కొండూరు: కొండపల్లి ఐడీఏలోని కెమికల్ కంపెనీల నుంచి విష వాయువులను రాత్రి సమయాల్లో విడుదల చేస్తున్నారంటూ పక్కనే ఉన్న కట్టుబడిపాలెం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులు 30 మంది శుక్రవారం అర్ధరాత్రి ఐడీఏలోని కెమికల్ కంపెనీల వద్దకు చేరుకొని విష వాయువుల విడుదల ఆపేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ కెమికల్ కంపెనీల్లో విడుదలయ్యే రసాయనిక వ్యర్థాలను నిల్వ చేసి రాత్రి సమయాల్లో మండించి ఆవిరిని గాలిలోకి విడుదల చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విధంగా చేయడం వల్లన గాలి కలుషితమై కట్టుబడిపాలెం గ్రామస్తులు మెదడు, కిడ్నీ వ్యాధులు, ఎలర్జీల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కెమికల్ కంపెనీల యాజమాన్యాలకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా విషవాయువుల విడుదలను ఆపడంలేదన్నారు. పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులు స్పందించి విషవాయువుల విడుదలను అరికట్టకపోతే నిరహారదీక్ష చేస్తామని హెచ్చరించారు.



కెమికల్ కంపెనీ వద్ద నిరసన తెలుపుతున్న కట్టుబడిపాలెం గ్రామస్తులు

15 నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నూజివీడు: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ఈ నెల 15 నుంచి మండలంలో టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నూజివీడు మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.దుర్గాభవాని శనివారం తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబరు 15 వరకు నిర్వహిస్తారు. 4 నెలల వయస్సున్న పశువులన్నింటికీ ఈ టీకాలు వేయించవచ్చన్నారు. కార్యక్రమంలో పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించి సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి విజ్ఞప్తి చేశారు.

సీఐటీయూ జిల్లా మహాసభలు వాయిదా

ఇబ్రహీంపట్నం: కొండపల్లిలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించాల్సిన సీఐటీయు జిల్లా 12వ మహాసభలు అనివార్య కారణాలతో వాయిదా పడినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. వివిధ అనుబంధ సంఘాల సమస్యలపై ఆందోళనకు పిలుపు ఇవ్వడం వలన రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వాయిదా నిర్ణయం తీసుకున్నామన్నారు. వచ్చే నెల 12, 13 తేదీల్లో మహాసభలు నిర్వహిస్తామన్నారు. అనబంధ సంఘాలు, ప్రజా సంఘాలు, సీఐటీయు నాయకులు గమనించాలని కోరారు.

లోక్ అదాలత్‌లో 446 కేసులు పరిష్కారం

నూజివీడు: లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పులు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ తెలిపారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు ఆవేశంలో చేసిన తప్పులకు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడటమే కాకుండా సమయం కూడా వృథా అవుతోందన్నారు. ఈ నేపథ్యంలో పేరుకుపోతున్న పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ లోక్ అదాలత్‌ను కక్షిదారులు ఉపయోగించుకోవాలని కోరారు. మొత్తం 446 కేసులను పరిష్కరించి రూ.2,29,03,600 సెటిల్ చేశారు. లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి, స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, పట్టణ సీఐ పి.సత్య శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నం రమేష్, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరులో లోక్ అదాలత్

తిరువూరు: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్ జరిగింది. న్యాయమూర్తి అనూష రాజీ చేసుకోదగిన 403 కేసులను కక్షిదారుల సమక్షంలో పరిష్కరించారు. పోలీస్, ఎక్సైజ్, రవాణా శాఖలకు సంబంధించిన కేసులను ఈ అదాలత్‌లో పరిష్కరించినట్లు న్యాయవాదులు తెలిపారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బడే మియా, సీనియర్ న్యాయవాదులు అత్తునూరి శ్రీనివాసరావు, రేగళ్ళ మోహనరెడ్డి, మేకల నాగేంద్రప్రసాద్, ఎం సత్యనారాయణ, నాగుబండి రామకృష్ణ, రాజేంద్రప్రసాద్, జమలయ్య, ఆనందస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ



తిరువూరు కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి అనూష

తోపుడు బండి అందజేత

మైలవరం: లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో దాతలు చనమోలు పాండురంగారావు, బేబీల పేరు మీద హాకర్‌కు తోపుడు బండి శనివారం అందజేశారు. మైలవరం బైపాస్ రోడ్ ఎస్ఎస్ బ్యాడ్మింటన్ ఏరీనా స్టేడియం వద్ద శనివారం దాత కుటుంబ సభ్యులు క్లబ్ ప్రసిడెంట్ చనమోలు నాగభూషణం, వారి కుటుంబ సభ్యులు, లయన్ జోన్ చైర్‌పర్సన్ లయన్ తిరుమలశెట్టి శ్రీధర్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ లయన్ జాస్తి వెంకటేశ్వరరావు, లయన్ లేళ్ళ ఏడుకొండలు, బాలాజీ మాస్టర్ , ప్రసాద్ మాస్టర్, లయన్ చంద్రం, లక్ష్మీ గణేష్, కోయ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మైలవరంలో లబ్ధిదారునికి తోపుడు బండి అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

110 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

మైలవరం: లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం, వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 110 మందికి పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. వీరిలో 20 మందికి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించినట్లు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రతి నెలలో రెండవ, నాలుగవ శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షులు సీహెచ్. నాగభూషణం, జడ్‌పీ శ్రీధర్, లయన్స్ సభ్యులు ఏ. చంద్రశేఖర్, కే. శ్రీనివాసరావు, బాలాజీ మాస్టర్, వాసవీ ఐకేర్ వైద్యులు వినోద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నానో యూరియాను వినియోగించాలి

చాట్రాయి: యూరియాకు బదులుగా వరి పంటకు నానో యూరియా వాడాలని వ్యవసాయ అధికారి బి.శివ శంకర్ తెలిపారు. మండలంలోని నరసింహారావుపాలెంలోని రైతులకు నానో యూరియా వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా డబ్బా 25 కేజీల యూరియాతో సమానమని చెప్పారు. ప్రస్తుతం నరసింహారావుపాలెం సొసైటీలో 25 మెట్రిక్ టన్నులు, చనుబండ సొసైటీలో 25 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు షాపుల్లో 20 మెట్రిక్ టన్నులు యూరియా ఉందని తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కాపాడుకుందాం

నూజివీడు: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. నూజివీడులో సీఐటీయూ 13వ జిల్లా మహాసభలు శనివారం నూజివీడులో ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా సీఐటీయూ పతాకాన్ని సీనియర్ నాయకులు ఎస్ఆర్ హనుమాన్లు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రభుత్వమే కొనసాగించాలన్నారు. కార్మిక వర్గం ఐక్యతతోనే ప్రైవేటీకరణను అడ్డుకోగలమని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను, ఉద్యోగులను చిన్నచూపు చూస్తున్నాయన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగుల, కార్మికుల వేతనాలు పెంచుతామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చారన్నారు. సూపర్ సిక్స్ హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటికి కేవలం తల్లికి వందనం, ఉచిత బస్సు తప్ప అమలు చేసిందేమీ లేదన్నారు. మహిళలకు నెలకు రూ.1500 సాయం ఎక్కడ అని నిలదీశారు. చదువుల కోసం వడ్డీ లేని రుణాలు, డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణం, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజా రామ్మోహన్‌రాయ్, జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి జి.రాజు, మొడియం నాగమణి, యర్నం సాయికిరణ్, ప్రసాద్, ఉపాధ్యక్షులు రాంబాబు, పోశమ్మ, నాయకులు రాజులపాటి చంటి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ జిల్లా మహాసభలో మట్లాడుతోన్న వీ ఉమామహేశ్వరరావు

సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలి

మైలవరం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం దిశగా మైలవరం మండల విద్యాశాఖాధికారి బండి రాజు చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ ఏపీ పక్షాన ఎన్టీఆర్ జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షుడు కోసూరి రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్ఫాన్ పాషా, మండల అధ్యక్షులు సీహెచ్ సతీష్‌కుమార్, పీఆర్‌టీయూ సభ్యులు కోరారు. మైలవరం మండలం విద్యాశాఖాధికారి బండి రాజును పీఆర్‌టీయూ ఎన్టీఆర్ జిల్లా నాయకులు శనివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని పలు ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాల్సిందిగా సంఘం తరపున కోరారు. కార్యక్రమంలో షేక్ బాజీ, అమీరున్నీసా, షకీలా, సుగుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.



ఎంఈఓ రాజును మర్యాదపూర్వకంగా కలిసిన పీఆర్‌టీయూ ఎన్టీఆర్ జిల్లా నాయకులు

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

తిరువూరు: రైతుబజారులో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఉల్లిపాయలు విక్రయించాలని రెవిన్యూ డివిజనల్ అధికారి కె.మాధురి ఆదేశించారు. రైతుబజారులో ఉల్లిపాయలను ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు వినియోగదారులు ఫిర్యాదు చేయడంతో శనివారం ఆర్డీవో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. బయట మార్కెట్లో అధికధర ఉన్నందున అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఉల్లిపాయలను రైతుబజారులో సబ్సిడీ ధరకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుబజారులో కాయగూరల ధరలను సైతం ఆమె పరిశీలించారు. దుకాణదారులు నిబంధనలు తప్పక పాటించాలని ఆదేశించారు.



తిరువూరు రైతుబజారులో ఉల్లిపాయల నాణ్యత పరిశీలిస్తున్న ఆర్డీవో

బలివే దేవస్థాన ట్రస్ట్ బోర్డు నియామకం

ముసునూరు: సుప్రసిద్ధ బలివే శ్రీరామ లింగేశ్వర స్వామి దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ కమిటీని నియమిస్తూ దేవదాయ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య శనివారం తెలిపారు. నూతనంగా ఎంపికైన కమిటీ ఈ నెల 24 బుధవారం ఉదయం దేవస్థాన ప్రాంగణంలో పదవీ స్వీకార ప్రమాణం చేస్తుందని చెప్పారు. కమిటీ అధ్యక్షుడిగా బి.శ్యామలరావు, సభ్యులుగా ఎస్.వెంకటసాయికృష్ణ, జి.గురునాథం, జి.వెంకటేశ్వరరావు, జి.కనకమ్మ, ఏ.మల్లిక, ఎస్.నాగదుర్గ, డి.పద్మావతి, కె.అన్నవరం, పి.నాగేశ్వరరావు, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ ప్రధానార్చకుడు తోలేటి అరుణ భాస్కరరావును నియమిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా-కట్టలేరు

వీరులపాడు: ఎగువన కురుస్తున్న భారీవర్షాల కారణంగా భారీగా వరద వస్తుండటంతో మండలంలోని పల్లంపల్లి సమీపంలోని వైరా-కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని ఆయా గ్రామాలలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. వైరా-కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పోలీస్, రెవెన్యూ శాఖాధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. వైరాకట్టలేరును తహసీల్దార్ రవికుమార్ పరిశీలించి రాకపోకలను నిలుపుదల చేశారు. రాకపోకలు సాగించకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ట్రాన్స్‌జెండర్ల వేధింపులపై ఫిర్యాదు

జగ్గయ్యపేటఅర్బన్: దసరా మామూళ్ల పేరుతో ట్రాన్స్ జెండర్లు వేధిస్తున్నారంటూ జగ్గయ్యపేటలోని పలువురు బంగారం వ్యాపారులు శనివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు బంగారు వ్యాపారులు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ జి.రాజుకు ఈమేరకు ఫిర్యాదు అందజేశారు. ట్రాన్స్‌జెండర్లు తరచూ తమ షాపులకు వచ్చి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఇవ్వకపోతే అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కావున ట్రాన్స్ జెండర్ల బారినుంచి తమను కాపాడాలని వ్యాపారులు కోరారు. అనంతరం ఎస్ఐ రాజు స్పందిస్తూ ఈ ఘటనపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

24న విజయవాడలో దళిత రణభేరి

నందిగామ రూరల్: దళితులపై దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్ డిమాండ్ చేశారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో శనివారం ఆపార్టీ ముఖ్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈనెల 24న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన దళిత రణభేరి కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు దొండపాటి శామ్యూల్ కుమార్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు యరగొర్ల ఉదయ్‌కిరణ్, దాసరి కృష్ణ, గాలంకి వెంకటేశ్వరరావు, దొన్న కోటేశ్వరరావు, జూపూడి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

విస్సన్నపేట: మహిళలు ఏదో ఒక యూనిట్ పెట్టుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎస్ఆర్ఎల్ఎం ప్రతినిధి, ఏపీ స్టేట్ యాంకర్ పర్సన్ లక్ష్మి పరస్కార్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎస్.నాగమణి అధ్యక్షతన జరిగిన మండల సమాఖ్య కార్యనిర్వహకవర్గం సమావేశంలో ఎస్ఆర్ఎల్ఎం ప్రతినిధి పాల్గొన్నారు. ఈసీ సబ్ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఎస్‌హెచ్‌జీ, విఓ, మండల సమాఖ్యలో రికార్డులు ఏవిధంగా రాయాలి అని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెర్ప్ ప్రతినిధులు వాల్మీకి, శోభారాణి, జిల్లా డీపీఎం శ్రీనివాసరావు, ఏపీఎంలు విజయలక్ష్మి, జమలయ్య పాల్గొన్నారు.



అత్యాచారాలను నిరోధించాలి

ముసునూరు: బాలికలు, మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలను నిరోధించాలని రక్షణ సైన్యం ఉప మండల సంఘాల మహిళా కన్వీనర్ మేజర్ పి.దేవకాంతమ్మ పిలుపునిచ్చారు. రక్షణ సైన్యం ఉపమండల క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో బాలికలు, మహిళలకు అవగాహన సదస్సు, మానవహారం, ర్యాలీ కార్యక్రమాలు శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రక్షణ సైన్యం చర్చి వద్ద నుంచి మండపం సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, రక్షణ సైన్యం కెప్టెన్ పుణ్యవతి, మేజర్ కుసుమకుమారి, మేజర్ లావణ్య, కెప్టెన్ బుల్లిపాప, విశ్వాసులు, భక్తులు పాల్గొన్నారు.



అత్యాచారాల నిరోధంపై ర్యాలీ చేస్తున్న రక్షణ సైన్యం ప్రతినిధులు

జెడ్పీ స్కూల్ అభివృద్ధి పనులు పరిశీలన

విస్సన్నపేట: స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో పలు అభివృద్ధి పనులను పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపట్టారు. ఈ మేరకు పనులను ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం శోభారాణి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి. పుల్లారావు, ఎన్‌టి వెంకటేశ్వరరావు, జగ్గవరపు రంగారెడ్డి, నందమూరి తిరుమలరావు పాల్గొన్నారు.



పాఠశాల వద్ద పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు